సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం। 13। మే। 2025



తడబడితే తప్పదు మూల్యం
విద్యా సంవత్సరం నెల రోజుల్లో ప్రారంభం కానుంది. ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్తగా ఉండాలి. పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి - 8లో



ఉపాధ్యాయుల ఇళ్లే టార్గెట్ !
రాజంపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 1 నుంచి 11వ తేదీ వరకు నలుగురి ఇళ్లల్లో చోరీలు జరిగాయి - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.109
రెండోరకం	రూ.66	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 596 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి ప్రధాన అర్చకులు మూల విరాట్లకు అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగు రంగుల పూలతో అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి, స్థానికులతో పాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రిస్తాం

రాయచోటి టౌన్ : నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రిస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురామయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు 22 రకాల నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి దుకాణం వద్ద ధరల పట్టిక, నిల్వల వివరాలు ప్రచురించాలని చెప్పారు. అక్రమంగా సరుకులు నిల్వలు ఉంచినా.. నల్లబజారుకు తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇండియా–పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో నిత్యావసర వస్తువుల లభ్యత, ధరలపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు నమ్మొద్దని తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

రాయచోటి : వివిధ సమస్యలతో ప్రజావేదికకు వచ్చిన బాధిత సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారంపై చర్యలు చేపట్టాలని అధికారులకు ఫోన్‌ద్వారా ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను పోలీసుశాఖకు స్వేచ్ఛగా తెలియజేయడానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉపయోగపడాలని తెలిపారు.

నిబంధనాలు

- అన్నదాత సుఖీభవ షరతులు వర్తిస్తాయి!
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిరైతుకు రైతు భరోసా
- కూటమి హామీ అమలుకు నిబంధనలు
- వ్యవసాయశాఖకు వెబ్‌ల్యాండ్‌లో భూముల వివరాలు పరిశీలించే అధికారం
- చివర్లో ఈకేవైసీ లేదంటే గోవిందా



మదనపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల వ్యవసాయ రైతాంగానికి నిబంధన లేకుండా అందరికీ రైతు భరోసా పథకం వర్తింపజేస్తే..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికి తీరిగ్గా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసేందుకు ముందుకొచ్చింది. అయితే ఈ పథకం వర్తించాలంటే షరతులు వర్తిస్తాయంటూ మెలిక పెట్టడంతో ఏ రైతుకు పథకం అందుతుందో ఏ రైతుకి పథకం ఊడుతుందో ముస్ముందు తెలుస్తుంది. అయితే ఈ నిబధనలతో రైతులకు తీవ్ర నష్టం కలిగేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. అన్నమయ్యజిల్లాలో 10,08,190 మంది రైతులకు గత ఆర్థిక సంవత్సరంలో కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ఎగ్గొట్టింది. ఒక్కో రైతుకు ఇస్తామన్న రూ.20 ఇచ్చుంటే..జిల్లా రైతాంగానికి రూ.406 కోట్ల లబ్ధి కలిగేది. దీనిని విస్మరించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కొర్రీ వేస్తోంది. ఈనెల 20లోగా చర్యలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించగా ఇక మిగిలించి వారమే.

ఎంపిక విధానం ఇలా

- వ్యవసాయ రైతుల భూముల వివరాలు కలిగిన వెబ్‌ల్యాండ్‌లో వివరాలు చూసుకునేందుకు ప్రభుత్వం వ్యవసాయ అధికారులకు లాగిన్ సౌకర్యం కల్పించింది.
- స్థానిక అధికారులు మొదట వెబ్‌ల్యాండ్ రైతుల వివరాలు పరిశీలిస్తారు.
- అర్హులైన రైతులని గుర్తిస్తే కిందిస్థాయి అధికారి అవే వివరాలతో పై స్థాయి అధికారికి, అక్కడి నుంచి వ్యవసాయశాఖ కమీషనర్‌కు నివేదిక చేరుతుంది.
- కమీషనర్ కార్యాలయంలో ఏఏ రైతుల పేరిట ఆదాయపన్ను ఉంది, వారికి సంబంధించిన ఇతరా ఆస్తుల వివరాలను తెలుసుకుంటారు. అర్హులు కాని రైతులను గుర్తించి వారిని జాబీతా నుంచి తొలగిస్తారు.
- కమిషనర్ కార్యాలయం ఎంపిక చేసిన రైతుల జాబితా మళ్లీ కిందిస్థాయి అధికారులకు పంపుతారు.
- వీరి పరిశీలించాక అదే జాబితాలోని రైతులు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపునకు నిర్ణయిస్తాయి.
- చివర్లో ఈ పథకానికి ఎంపిక చేసిన ప్రతిరైతూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. లేదంటే పథకం ఆగిపోయింది. రైతులకు ఆర్థిక సహాయం అందదు
- ఈ చర్యలన్నీ ఈనెల 20వ తేదిలోగా పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

వెబ్‌ల్యాండే ప్రామాణికంగా..

వైఎస్సార్‌సీపీ పాలనలో గత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుల భూముల వివరాలు కలిగిన వెబ్‌ల్యాండ్ వివరాలే ఆధారంగా ఐదేళ్లపాటు రైతు భరోసా పథకాన్ని నిర్విఘ్నంగా అందించారు. ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలగలేదు. అందరి రైతుల్లో సంతోషం కనిపించేంది. అధికారుల పరిశీలన, నివేదికలు అంటూ హడావుడి ఎక్కడా కనిపించేది కాదు. ఒక్క రైతు కూడా ఈ పథకం అందలేదన్న ఫిర్యాదు లేకుండా పథకం కొనసాగించారు. కేంద్రవాటా రూ.6,500, రాష్ట్రప్రభుత్వ వాటాగా రూ.7,500 కలిపి రూ.13,500 వైఎస్.జగన్ ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిబంధనల పేరుతో లబ్ధిదారులైన రైతుల జాబితాలో కోతలు విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జగన్ పాలనలో రైతు భరోసా (రూ. కోట్లలో)

ఏడాది	రైతులసంఖ్య	చెల్లింపు
2019–20	1,96,010	రూ.147.00
2020–21	2,05,716	రూ.154.28
2021–22	2,04,133	రూ.153.09
2022–23	1,98,957	రూ.149.21
2023–24	2,03,374	రూ.152.53

రైతు భరోసా లబ్ధి వివరాలు

మొత్తం రైతులు	– 10,08,190
అందించిన సాయం	– రూ.1,361 కోట్లు
రాష్ట్ర ప్రభుత్వం	– రూ.756,14,25,000
కేంద్ర ప్రభుత్వం	– రూ.604,91,40,00

రుణాలతో కుదేలు



రైతు భరోసా పథకం పొందిన రైతులకు గత ఐదేళ్ల బ్యాంకుల్లో రైతులకు రుణాల మంజూరు, తీసుకున్న రుణాలకు తిరిగి వడ్డీ చెల్లింపు బాధ్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకుంది. దీని వల్ల రెండువైపులా రైతాంగానికి ప్రయోజనం కలిగేది. ప్రస్తుతం ఈ పథకాల్లో కోతలు మొదలైతే కరువుతో ఇబ్బంది పడుతున్న రైతులకు కష్టాలే. కాగా జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ద్వారా వ్యవసాయానికి రూ.10,098 కోట్ల రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికి డిసెంబర్ నాటికి రూ.9,741 కోట్ల రుణాలను అందించినట్లు అధికారిక లెక్క చెబుతున్నా వాస్తవ పరిస్థితిలో అవన్నీ రెన్యూవల్ రుణాలే అని తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తే రైతాంగం పరిస్థితి చెప్పకనే చెబుతుంది.

నందబాలుని ఆనంద విహారం

ముగిసిన దేవునికడప తెప్పోత్సవాలు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ తెప్పోత్సవాలలో భాగంగా మూడవరోజు సోమవారం ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లు తెప్పపై విహరించారు. ఆలయ అర్చకులు తొలుత ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు తిరుమంజన అభిషేకం నిర్వహించి అలంకారం చేశారు. అనంతరం పల్లకీపై స్వామికి సమీప వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు ఉత్సవ మూర్తులను తీసుకొచ్చి అలంకరించి పూజలు చేసి తెప్పపై కొలువుదీర్చారు. మూడుమార్లు వేద పండితుల మంత్రోచ్చాటనలు, రెండుసార్లు మంగళ వాయిద్యాల సుస్వరాలు, మరో రెండుసార్లు అన్నమాచార్య కీర్తనల మధ్య తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు బృందం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు



స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

శ్రీవారి మహిమలు అన్నమయ్య కీర్తనలతో విశ్వవ్యాప్తం

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట : శ్రీవారి మహిమలు అన్నమయ్య కీర్తనల ద్వారా విశ్వవ్యాప్తమయ్యాయని రాజంపేట శాసనసభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం తాళ్లపాకలో అన్నమాచార్య జయంతి సందర్భంగా ధ్యానమందిరంలోని అన్నమాచార్యుని దర్శించుకున్నారు. ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తన గానంతో వెంకటేశ్వరస్వామి హృదయంలో స్థానం కలిగిన అన్నమయ్యతో ఎవరు కూడా సాటిరారన్నారు. స్వామి అనుగ్రహంతో ఎవరూ ఈ సృష్టిలో రచించిలేని రచనలు ప్రారంభించిన అద్భుతమైన ప్రాంతం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక అన్నారు. వెంకటేశ్వర స్వామి మహిమలు, మహాత్యం.. తెలియలాంటే అన్నమయ్య కీర్తనలు విశ్వవ్యాప్తం కావాలన్నారు. స్వామివారిని ప్రత్యక్షంగా చూసిన, స్వామివారి అందాలను తన కీర్తనలతో అభివర్ణించి తెలియచేసిన మహాజ్ఞాని అన్నమయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ దొడ్డిపల్లె భాస్కరరాజు, ఎంపీటీసీ మధుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు శివయ్య,రెడ్డయ్య,శేఖర్‌రెడ్డి, బోయనపల్లె సర్పంచి రాజా, బొడిచెర్ల సుబ్బరాయుడు, రామయ్య, శివకుమార్, సొంబెత్తిన శ్రీనువాసులు టీటీడీ అధికారులు తాళ్లపాక గ్రామస్తులు పాల్గొన్నారు



తాళ్లపాకలో అన్నమాచార్యుని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఆకేపాటికి సత్కారం

అన్నమాచార్య జయంత్యుత్సవాలలో తొలిరోజు తాళ్లపాకలోని అన్నమాచార్య ధాన్యమందిరానికి ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి వచ్చారు. ఈసందర్భంగా టీటీడీ అధికారులు ఆయనను సత్కరించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రసాదాలను అందచేశారు. అనంతరం కల్యాణవేదికపై ఆసీనులైన వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి,భూదేవి ఉత్సవమూర్తులను ఆకేపాటి దర్శించుకున్నారు.

24 గంటలూ మెరుగైన విద్యుత్

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి : ఆర్‌డీఎస్ స్కీమ్ ద్వారా గ్రామాలలో 24 గంటలూ మెరుగైన విద్యుత్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర రవాణా,యువజన క్రీడాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి, జిల్లా కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి ఆర్డీఎస్ స్కీమ్‌పై ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఆర్డీఎస్ స్కీమ్ ద్వారా త్రీఫేస్ కనెక్షన్ ఇచ్చి 24 గంటలూ మెరుగైన విద్యుత్ సరఫరా చేయనున్నట్లు వివరించారు.జిల్లాలో జరుగుతున్న ఆర్డీఎస్ స్కీమ్ త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీఎస్ స్కీమ్ ద్వారా మారుమూల గ్రామాలలో సైతం చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, పవర్ గ్రిడ్ డీజీఎం కిరణ్, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కన్‌స్ట్రక్షన్ శ్రీనివాసరెడ్డి, రాజంపేట, మదనపల్లి, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఫిర్యాదులకు సత్వర పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.అధికారులు ప్రాధాన్యతగా ఫిర్యాదు లను నూరుశాతం పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసాలతో సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్

పేదింటి బిడ్డలపై ఫీజులుం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించని కూటమి సర్కార్
- ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని అధికారులు
- సర్టిఫికెట్లు కావాలంటే పెండింగ్ ఫీజు చెల్లించాలంటున్న అధికారులు
- ప్రభుత్వ పెద్దల్లో లోపించిన మానవత్వం.. వాపోతున్న విద్యార్థులు



సాక్షి ప్రతినిధి, కడప : చదువులు అయిపోయాయి... కొలువుల్లో చేరాలనే ఆతృత విద్యార్థులది. ఆ సర్టిఫికెట్లు కాస్త చేజారితే బకాయిలు పెండింగ్‌లో ఉండిపోతాయనే ఆందోళన యూనివర్సిటీ యంత్రాంగానిది. వెరసి కూటమి సర్కారు నిర్వాకంతో ఇటు చదువుల బిడ్డలు.. అటు యూనివర్సిటీ అధికారులు నలిగిపోతున్నారు. వివరాల్లోకి వెళితే..

పేదింటి గ్రామీణ చదువుల బిడ్డలకు ఉన్నత విద్యను అందించాలనే సదాశయంతో ప్రవేశ పెట్టిన ట్రిపుల్ ఐటీపై కూటమి సర్కార్‌కు చిత్తశుద్ధి లోపించింది. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు విడుదల చేయకుండా తాత్సారం చేస్తోంది. ఫలితంగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ట్రిపుల్ ఐటీ విద్య పూర్తయ్యింది, కొలువుల్లో చేరేందుకు వెళ్లాలి, సర్టిఫికెట్లు జారీ చేయండని విద్యార్థులు అడుగుతుంటే యూనివర్సిటీ అధికారులు చెవికెక్కించుకోవడం లేదు. ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి, మీరు సర్టిఫికెట్లు తీసుకెళ్తే తమ బకాయిలు ఎలా? అంటూ తిరిగి ప్రశ్నిస్తున్నారు. బకాయిలు క్లియర్ చేసిన తర్వాత సర్టిఫికెట్లు జారీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. డబ్బులు చెల్లించే స్థోమత తమకు తమ కుటుంబాలకు లేదని, ప్రభుత్వ బకాయిలు సర్దుబాటుకు కావాల్సిన ఎన్‌ఓసీ తీసుకొని తమ సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు విన్నవిస్తున్నారు. వారి ఆవేదన పట్టించుకునే స్థితిలో ఆర్జీయూకేటీ యూనివర్సిటీ కన్పించడం లేదు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలనే దిశగా అటు అధికారులకు ఇటు కూటమి నేతలకు కూడా లేకపోవడంతో 8వేల మంది విద్యార్థుల సమస్య పెండింగ్‌లో ఉండిపోయింది.

చొరవ చూపని ఆర్జీయూకేటీ...

విద్యార్థుల నుంచి ఫీజులు వసూళ్లు చేసుకోవాలనే ఆలోచనకు తగ్గట్లుగా ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు చేయాలనే ఆలోచన ఆర్జీయూకేటీ అధికారుల్లో కన్పించలేదు. ఉన్నత విద్యామండలి దృష్టికి సమస్యను తీసుకెళ్లి, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిల వివరాలు సేకరించి, ఎవరెవరికి ఫీజు రీయింబర్స్‌మెంటు డబ్బులు పడ్డాయి. పేరెంట్స్ అకౌంట్లల్లో ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు పడ్డాయా? అలాంటి వారు బకాయిలు ఎంత ఉన్నాయో తెలుసుకుని వారి సర్టిఫికెట్లు జారీ చేయడానికి అభ్యంతరం చెబితే అర్థం ఉందని విశ్లేషకులు వివరిస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించని పక్షంలో విద్యార్థుల నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు తీసుకొని ప్రభుత్వం నుంచి నేరుగా యూనివర్సిటీకి బకాయిలు చెల్లించేలా ఉన్నత విద్యామండలితో సంప్రదించి సర్టిఫికెట్లు జారీ చేయవచ్చు కదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆ దిశగా ఆర్జీయూకేటీ చొరవ చూపడం లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

రూ.3.20 లక్షలు చెల్లించమంటున్నారు...



ఇంజనీరింగ్ ఫైనలియర్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో తమకు సర్టిఫికెట్లు ఇవ్వాలని ట్రిపుల్ ఐటీ అధికారులను కోరగా.. రూ.3.20 లక్షలు చెల్లించమంటున్నారు. మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు రమేష్, హైమావతి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పోను మిగిలిన బకాయిలు చెల్లిస్తేనే తప్ప సర్టిఫికెట్లు ఇవ్వమని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ట్రిపుల్ ఐటీకి చెల్లిస్తే విద్యార్థుల తల్లిదండ్రులు ఖాతాలో జమ చేస్తామని చెబుతున్నారు.
– ధరణి
(ఈసీఈ ఇంజినీరింగ్ ఫైనలియర్) చిత్తూరు జిల్లా, పుట్టూరు

అధికారులు మాట మారుస్తున్నారు...



2019లో నేను ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో చేరాను. చేరేటప్పుడు పీయూసీ–1కు రూ.36వేల చొప్పున రెండేళ్లకు రూ.72వేలు, ఇంజినీరింగ్ నాలుగేళ్లకు రూ.4వేల చొప్పున రూ.1.60లక్షలు చెల్లిస్తే చాలు అని చెప్పారు. ఇప్పుడేమో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అధికారులు మాట మారుస్తున్నారు. దీనిపై ఫైనలియర్ విద్యార్థులందరం ధర్నా కూడా చేశాం. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ విద్యార్థులకు సర్ది చెప్పి త్వరలోనే ఉన్నతాధికారులతో మాట్లాడి ఎంత ఫీజు కట్టాల్సింది వెల్లడిస్తామని చెప్పారు. ఇప్పటివరకు అధికారుల్లో ఎలాంటి స్పందన లేదు. దీనిపై త్వరగా స్పందించాల్సి అవసరం ఉంది.
– వైష్ణవి
(ఈఈఈ విద్యార్థిని), అనంతపురం జిల్లా, సింగనమల గ్రామం

అధికారులు చెప్పిన ఫీజులు చెల్లించలేం...



ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కే వ్యాలీ క్యాంపస్ లో ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు అధికారులు చెప్పిన ఫీజులను చెల్లించలేం. సెమిస్టర్–2 ఎగ్జామ్స్ పూర్తయి త్వరలో రిజల్ట్స్ వస్తాయి. మేము క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలకు ఎంపికైన సందున త్వరలోనే సర్టిఫికెట్లు ఇవ్వాలని అధికారులను కోరాం. కానీ ట్రిపుల్ ఐటీ అధికారులు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే తప్ప సర్టిఫికెట్లు ఇవ్వమని అంటున్నారు. సర్టిఫికెట్లు లేకపోతే ఉద్యోగాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది.
– యండ్లూరు ఇందు
(ట్రిపుల్ ఐటీ విద్యార్థిని), సత్యసాయి జిల్లా, కదిరి

విదేశీ విద్యావకాశాలపై అవగాహన

కురబలకోట: మారుతున్న ప్రపంచంలో వివిధ విదేశీ యూనివర్సిటీలు భారత విద్యార్థులకు అర్థవంతమైన అవకాశాలు కల్పిస్తున్నాయని హైదరాబాద్ అర్వ మేనేజ్‌మెంట్ సర్వీస్ రీసోర్సు పర్సన్ ఎ. అనిల్ కుమార్ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విదేశీ విద్య, స్కాలర్‌షిప్‌లపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రపంచ వ్యాప్తంగా కేరీర్‌లో విద్యార్థులు రాణించవచ్చన్నారు. ఆకాశమే హద్దుగా ఉపాధి, ఉద్యోగ రంగాలతో పాటు పరిశోధన రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందుకు విదేశీ ఉన్నత విద్యావకాశాలు కొత్త దిక్సూచిగా నిలుస్తున్నాయన్నారు. ప్రపంచ స్థాయిలో విద్యాభ్యాసం మనిషి జీవితంలో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతుందన్నారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలు భారత విద్యార్థులకు వీసా సడలింపులు, స్కాలర్‌షిప్ లు పెంచడం వంటి ప్రక్రియలతో విద్యార్థులు విదేశీ ఉన్నత విద్య పట్ల మక్కువ చూపుతున్నారన్నారు.భాషా నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ అవసరమన్నారు. కార్యక్రమంలో ఇంగ్లీషు విభాగాధిపతి డాక్టర్ సమీనా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్ కుమార్

ఘనంగా నల్లగంగమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయ నల్లగంగమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మొలకలపౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని వేపాకులతో శుద్ధిచేసి పచ్చని తోరణాలు, వివిధరకాల పుష్పాలతో అంకరించారు. ప్రతి ఏడాది మొలకల పౌర్ణమి రోజున అమ్మవారి తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. మొక్కులు తీరిన వారు చాందినీ బండ్లను అమ్మవారి ఆలయం చుట్టూ తిప్పారు.ఆలయ కమిటీ సభ్యులు దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా స్థానిక ఎస్ఐ భక్తవత్సలం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుర్తు తెలియని మహిళ మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని ఒక పాడు బడిన గదిలో గుర్తు తెలియని మహిళ(45) మృతి చెందింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచారు. వారు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఎవరైనా భిక్షాటనకు వచ్చి వడదెబ్బ సోకి మృతి చెంది ఉంటుందనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరుపుతామని సీఐ వెంకటాచలపతి తెలిపారు.

భార్యపై కత్తితో దాడి

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో భార్యపై భర్త కత్తితో దాడిచేసిన ఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం నేతాజీ కాలనీకి చెందిన రమణ తన భార్య సుజాత(45)పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. వారు ఇటీవల కొంత అప్పుచేసి ఇంటిని నిర్మించారు. అప్పులు తీర్చేందుకు భర్తకు తెలియకుండా భార్య గొర్రెలు అమ్మడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆవేశానికి లోనైన రమణ భార్య సుజాతపై కత్తితో దాడిచేశాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని భైరవగుట్ట ఫారెస్ట్ చెక్‌పోస్ట్ ఆవరణలో ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నాలుగు చక్రాల లగేజ్ టెంపోను ఆపి తనిఖీ చేయగా డ్రైవర్ నాగేశ్వర మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు తనిఖీలో గుర్తించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని మద్యం తాగిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తడబడితే తప్పదు మూల్యం

- ముందస్తు అడ్మిషన్లతో తస్మాత్ జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోకండి
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- రిజిస్ట్రేషన్, గుర్తింపుపై ఆరా తీయండి
- క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారని పరిశీలించాకే అడ్మిషన్ తీసుకోవాలి



కడప నగరంలో ఓ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాల

కడప ఎడ్యుకేషన్ : విద్యా సంవత్సరం మరో నెల రోజుల్లో ప్రారంభం కానుంది. జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల తోక పేర్లతో నూతన బ్రాంచిల పేరిట ఆయా ప్రాంతాల్లో ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు హంగులూ, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియను చేపడుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే విద్యార్థుల చేరికలో ఆయా పాఠశాలలకు అనుమతి ఉన్నదేదో లేనిదేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో తల్లిదండ్రులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్యాశాఖ నియంత్రణ కొరవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కొన్ని విద్యా సంస్థలు సీబీఎస్ఈ అనుమతులు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. మొదట ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి. ఇలా అన్ని అనుమతులుంటేనే పాఠశాలలను నిర్వహించాలి.

వీటిపై ఆరా తీయండి..

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి. ఇది నిబంధన. అయితే చాలా విద్యాసంస్థల బోర్డులు, ప్రకటనలు నిశితంగా పరిశీలిస్తే రిజిస్టర్ అని ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఎవరైనా చేసుకోవచ్చు. కానీ విద్యాశాఖ నుంచి గుర్తింపు తీసుకోవడం తప్పనిసరి. గుర్తింపు పొందిన విద్యా సంస్థలలోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరపున పరీక్షలు రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే పరిగణిస్తుంది. మరికొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు బ్రాంచీల పేరుతో పాఠశాలలను, కళాశాలలను నడుపుతూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి ద్వారా పరీక్షలు రాయిస్తుంటారు. ఇలాంటి విషయాలలో తల్లిదండ్రులు కచ్చితంగా విచారించి విద్యా సంస్థ అనుమతి పత్రాలను అడిగి తెలుసుకున్న తరువాతే పిల్లలను చేర్పించాలి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..



ప్రతి ప్రైవేటు విద్యా సంస్థ ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలి. విద్యార్థులకు పాఠశాలల్లో క్రీడా మైదానంతో పాటు అన్ని వసతులు పక్కాగా ఉండాలి. లేకుంటే ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేస్తాం. అదే విధంగా విద్యా సంస్థ పక్కాగా రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు తప్పక పొంది ఉండాలి. తల్లిదండ్రులు ప్రైవేటు సంస్థల ఆకట్టుకునే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు. అన్ని జాగ్రత్తలు పాటించి పిల్లలను చేర్పించాలి.

\- షేక్ షంషుద్దీన్, డీఈఓ, వైఎస్సార్ కడప జిల్లా

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి..

- తొలుత పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- మౌలిక వసతులతోపాటు బాత్‌రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు తప్పనిసరి.
- విద్యార్థుల మానసిక, శారీరక ఉల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు ఉన్నారా లేదా ఆరా తీయాలి.
- అర్హత గల ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారా లేదా పరిశీలించాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణాశాఖ జారీ చేసిన సామర్థ్య పరీక్ష పత్రాన్ని జారీ చేస్తుంది. సుశిక్షితుడైన డ్రైవరు తప్పనిసరి.
- జీ-1 భవనాలు ఉంటే అగ్నిప్రమాదక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తిస్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారీగా పేర్కొంటున్నారు. ఫలితంగా సమస్యలు ఏర్పడతాయి.

ఉపాధ్యాయుల ఇళ్లే టార్గెట్!

రాజంపేటలో వరుస చోరీలు


మురళీమనోహర్ ఇంటి తాళాలను దొంగలు పగులగొట్టిన దృశ్యం


సోమశేఖర్ ఇంటిలోని బీరువా తాళాలు పగులగొట్టి బీరువాను తెరిచిన దృశ్యం

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నలుగురు ఉపాధ్యాయుల ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఇసుకపల్లె ప్రాథమిక పాఠశాలలో హెడ్ టీచర్‌గా పనిచేసే సాయిప్రసాద్ పట్టణంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 1వ తేదీ సాయిప్రసాద్ కుటుంబంతో సహా టూర్‌కు వెళ్లగా అదే రోజు రాత్రి దొంగలు ఆయన ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం దాదాపు ఆరు లక్షల విలువచేసే బంగారు వస్తువులను దొంగలు దొంగిలించుకుపోయినట్లు సాయిప్రసాద్ తెలిపారు. అలాగే పట్టణంలోని మన్నూరులో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయిని సుజాత కుటుంబ సభ్యులు వ్యక్తిగత పనిపై ఈనెల 8తేదీ ఉదయం కడపకు వెళ్లి అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చేలోపు దొంగలు చోరీకి పాల్పడ్డారు. పట్టపగలే దొంగలు ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి దొంగతనం చేయడం గమనార్హం. దాదాపు 20 తులాల బంగారు, నాలుగు లక్షల నగదు, మూడు వందల గ్రాముల వెండి చోరీకి గురైనట్లు సుజాత తెలిపారు. మండలంలోని కొండ్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న సోమశేఖర్ మన్నూరులో నివాసం ఉంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లగా ఈనెల 8వ తేదీ రాత్రి సోమశేఖర్ ఇంటిలో దొంగలు పడి చోరీకి పాల్పడ్డారు. దాదాపు రెండు లక్షల రూపాయల విలువ చేసే వెండినగలను దోచుకెళ్లినట్లు ఆయన తెలిపారు. మండలంలోని జి.ఒడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న మురళీ మనోహర్ కుటుంబ సభ్యులతో బెంగళూరులో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లగా ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. అరవై గ్రాముల బంగారును దొంగలు ఎత్తుకెళ్లినట్లు మురళీ మనోహర్ తెలిపారు.

బలమైన తలుపు తాళాలను సైతం బద్దలు చేస్తున్న దొంగలు..

దొంగలు బలమైన తాళాలను సైతం బద్దలు చేస్తున్నారు. ఇంటికి ఉన్న సేఫ్టీ గ్రిల్‌కు వేసిన తాళాన్ని పగులగొట్టి ఆ తరువాత బలంగా ఉండే ప్రధాన ద్వారం తాళాన్ని తొలగిస్తున్నారు. ప్రధాన ద్వారం తాళాలను తొలగించిన విధానాన్ని పరిశీలిస్తే ఒకే ముఠా ఈ చోరీలకు పాల్పడినట్లు అర్థమవుతోంది. దొంగలు తాళాలను తొలగించేందుకు స్క్రూ డ్రైవర్, కటింగ్‌ప్లేయర్, సుత్తివంటి వాటిని ఉపయోగించి సులువుగా తాళాలను తొలగించేస్తున్నట్లు తెలుస్తోంది.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన మదనపల్లె డీఎస్పీ, సీఐ
- యువతి కాళ్లు, చేతులు కట్టేసి పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన దుండగులు
- డాగ్‌స్క్వాడ్‌కు కూడా అంతు చిక్కని వైనం


యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు-ఎలకపల్లి మార్గంలోని గుట్ట ప్రదేశంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం ఉదయం రైతులు గుర్తించి విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, సీఐ సత్యనారాయణలు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువతి గుర్తు తెలియకుండా కాలిపోవడంతో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి వయసు సుమారు 20 నుంచి 30 సంవత్సరాలు ఉన్నట్లు గుర్తించారు. యువతిని అతి కిరాతకంగా చేతులు, కాళ్లు తాళ్లతో కట్టేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. విషయం దావానలంలా వ్యాపించడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా సమీపంలోని కర్ణాటక నుంచి కూడా తండోపతండాలుగా చూసేందుకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయినా ఎవరికి మృతదేహం ఎవరిదన్నది అంతుచిక్కలేదు. దీంతో చిత్తూరు నుంచి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. కుక్కలు మృతదేహం వద్ద నుంచి ఎలకపల్లి గ్రామం వరకు వెళ్లి తిరిగి వెనక్కి వచ్చేశాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు.

ఆటో ఢీకొని డిగ్రీ విద్యార్థికి తీవ్ర గాయాలు


ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడిన డిగ్రీ విద్యార్థి సుహేల్

మదనపల్లె రూరల్ : ఆటో ఢీకొని డిగ్రీ విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. సత్యసాయి జిల్లా కదిరి మండలం కొండకమర్లకు చెందిన చాంద్‌బాషా కుమారుడు సుహేల్(21) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం పట్టణంలోని బీటీ కాలేజీలో పరీక్ష ముగించుకుని ద్విచక్ర వాహనంలో కురబలకోట మండలం అంగళ్లులోని స్నేహితుడి వద్దకు వెళుతుండగా, మార్గమధ్యంలోని అమ్మచెరువుమిట్ట ఏపీ గోడౌన్ వద్ద ఆటో ఢీకొంది. ప్రమాదంలో సుహేల్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వాట్సాప్ బాట్ ద్వారా ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపు

కడప కల్చరల్ : వాట్సాప్ బాట్ ద్వారా ఎల్ఐసీ పాలసీ ప్రీమియం చెల్లింపు సౌకర్యం మే 9 నుంచి అందుబాటులోకి వచ్చిందని కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌సీ రవికుమార్ తెలిపారు. ఇప్పటిదాకా ఎల్ఐసీ కస్టమర్ పోర్టల్‌పై 2 కోట్ల 20 లక్షల మంది తమ పాలసీలను నమోదు చేసుకున్నారని, ప్రతిరోజు మూడు లక్షల మంది ఆన్‌లైన్ సేవలు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు ఈ వాట్సాప్ బాట్ సౌకర్యం అదనంగా అందుబాటులోకి రావడంతో పాలసీదారులు ఎల్ఐసీ కార్యాలయాలకు వెళ్లాల్సిన పని లేదన్నారు. పాలసీలపై ప్రీమియంలు చెల్లించవచ్చన్నారు. 8976862090 వాట్సాప్ నంబరుకి ఏజీ అని మెసేజ్ చేస్తే, మన పాలసీలపై చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఆ తర్వాత వాట్సాప్ బాట్ నుంచే యూపీఐ, నెట్ బ్యాంకింగ్, కార్డ్స్ ద్వారా ప్రీమియం చెల్లింపులు చేయవచ్చన్నారు. ఇదే కాకుండా ఎల్ఐసీకి సంబంధిన మరో 14 సేవలకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చన్నారు. వాట్సాప్ బాట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన పాలసీదారులను కోరారు.

బియ్యం లారీ సీజ్ - విడుదల


పోలీస్ స్టేషన్ ముందున్న బియ్యం లారీ

కలికిరి : రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ముని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుటే బియ్యం లారీని ఆపి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు లారీని సీజ్ చేసిన పోలీసులు సమాచారం ఉన్నతాధికారులకు తెలియచేశారు. బియ్యం రవాణాదారు మధ్యాహ్నానికి బియ్యం రవాణాకు సంబంధించి సంబంధిత రికార్డులను చూపడంతో పరిశీలించిన పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రవాణాదారుకు లారీని అప్పగించారు. అయితే లారీని అదుపులోకి తీసుకున్నప్పుడు లేని రికార్డులు మధ్యాహ్నానికి ఎలా వచ్చాయనేది చర్చనీయాంశంగా మారింది.

లోయలో పడిన కోలాట బృందం వాహనం

తప్పిన ఘోర ప్రమాదం


లోయలో పడిన వ్యాన్


గాయపడిన మహిళ

రాజంపేట : రాజంపేట-రాయచోటి ఘాట్‌రోడ్‌లోని లోయలో కోలాట బృందం పయనిస్తున్న బొలెరో లగేజీ వాహనం బోల్తా పడింది. సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. కోలాట బృందంలోని వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. దీంతో ఘోరప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు. నెల్లూరు జిల్లా నుంచి మదనపల్లెకు కోలాట బృందం వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఇందులో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, 16 మందికి స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని రాజంపేట ప్రాంతీయవైద్యశాలకు తరలించారు. మన్నూరు పోలీసు స్టేషన్‌లో ఎలాంటి కేసు కూడా నమోదు కాలేదు.

బస్టాండ్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న వేలూరు పోలీసులు


అదుపులోకి తీసుకున్న వ్యక్తిని వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

మైదుకూరు : ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉన్న సమయంలో మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక్కసారిగా అక్కడున్న ఓ నిందితుడిని తమిళనాడులోని వేలూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అది చూసిన ప్రయాణికులు కొద్ది సేపు ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. బస్టాండ్‌లో ఉన్న వ్యక్తిని సాధారణ పౌరుల దుస్తుల్లో ఉన్న కొంత మంది ఒక్క సారిగా పట్టుకుని ఈడ్చుకుంటూ వెళ్లడం కలకలం రేపింది. అతన్ని వాహనంలో ఎక్కిస్తున్న సమయంలో ప్రయాణికులు వాహనాన్ని చుట్టుముట్టారు. పలువురు వీడియో, ఫొటోలు తీయకుండా ప్రయత్నించారు. అయితే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న వారు ఫొటోలు తీయకుండా అడ్డుకున్నారు. తర్వాత తాము వేలూరు పోలీసులమని పలు కేసుల్లో ఈ వ్యక్తి నిందితుడిగా ఉన్నాడని, ఇతని కోసం నెల రోజులుగా గాలిస్తూ ఇప్పుడు పట్టుకున్నామని తెలిపారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయొద్దని అన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

కాశినాయన : మండలంలోని బాలాయపల్లె గ్రామం రామాలయంలో ఆదివారం అర్ధరాత్రి హుండీ చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. దేవాలయం తాళం పగులకొట్టి హుండీ తీసుకెళ్లారన్నారు. ఊరి బయటికి వెళ్లి హుండీని పగులకొట్టి నగదు ఎత్తుకెళ్లారన్నారు. పోలీసులకు సమాచారం అందించామని గ్రామస్తులు తెలిపారు.

మేం చెప్పిందే వేదం!

- పెద్దమ్మ దేవాలయం ఆక్రమణలు చట్టబద్ధం చేస్తున్న పోట్లదుర్తి బ్రదర్స్
- ప్రాంగణం మొత్తం ప్రహరీ నిర్మించాలంటున్న గ్రామస్తులు
- హైకోర్టు తీర్పును సైతం ఉల్లంఘిస్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, కడప : పోట్లదుర్తిలో మేం చెప్పిందే వేదం. ప్రభుత్వ, ప్రైవేటు వ్యవహారాలు ఏవైనా సరే, మా ఇష్టారాజ్యంగా కొనసాగాల్సిందే. కోర్టు ఉత్తర్వులకు సైతం ధిక్కారమే. ఇదేమి న్యాయం, ఇదేమి ధర్మమన్న గ్రామస్తులపై పోలీసు అధికారుల ద్వారా బెదిరింపులకు దిగుతున్నారు. గ్రామ దేవత పెద్దమ్మ దేవాలయం ప్రాంగణం మొత్తం ప్రహరీ నిర్మించాలని హైకోర్టు ఉత్తర్వులున్నాయి. ఆ ఉత్తర్వులు అమలు చేయాల్సిందిగా దేవదాయశాఖ సంయుక్త కమిషనర్ ఎండోమెంటు అసిస్టెంట్ కమిషనర్‌ను ఆదేశించారు. హైకోర్టు ఉత్తర్వులు భేఖాతర్ చేస్తున్న వైనాన్ని ప్రశ్నించిన గ్రామస్తులపై ఖాకీ ఆగ్రహించిన వైనమిది.

పోట్లదుర్తి గ్రామంలో సర్వేనంబర్ 657లో 3.06 ఎకరాలు పెద్దమ్మ దేవాలయం భూమి. అందులో కొంత భాగం ఆక్రమణ చేశారు. పెద్దమ్మ దేవాలయం భూమి మొత్తానికి ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా, ఆక్రమణలతో నిమిత్తం లేదు. ఉన్న భూమికి మాత్రమే ప్రహరీ నిర్మిస్తామని పోట్లదుర్తి బ్రదర్స్ స్పష్టం చేస్తున్నారు. ఇదివరకే రూ.9 0లక్షలు సీఎం రమేష్ రాజ్యసభ గ్రాంట్ నుంచి దేవాలయంలో ప్రహరీ, ఇతర పనుల కోసం కేటాయించారు. గ్రామస్తులంతా ముక్తకంఠంతో దేవాలయం భూమి అన్యాక్రాంతం కాకుండా మొత్తానికి ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వారి అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు దేవాలయం ప్రాంగణం మొత్తానికి ప్రహరీ నిర్మించాలని డబ్ల్యూపీ నెంబర్ 871/2025 ద్వారా ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని దేవదాయశాఖ సంయుక్త కమిషనర్ భ్రమరాంబ ఆర్సీ నెంబర్ ఎం3/19024(39)/2/ 2025 ద్వారా ఈనెల 6న ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆ ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టడంపై గ్రామస్తులు అభ్యంతరం చెప్పారు.

అక్కడికెళ్తే కేసులు నమోదు చేస్తాం..

గ్రామస్తులు ప్రహరీ నిర్మాణానికి అడ్డు తగులుతున్నారని పోట్లదుర్తి బ్రదర్స్ ఎర్రగుంట్ల పోలీసులను ఉసిగొల్పారు. వారి ఆదేశాలను తు.చ. అమలు పర్చేందుకు సిద్ధమైన ఓ ట్రెయినీ ఎస్సై అధికారి గ్రామస్తులపై విరుచుకుపడ్డారు. ఆ పనుల వద్దకు మీరు వెళ్లొద్దంటూ హుకుం జారీ చేశారు. ఓ వైపు హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన, మరోవైపు దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలు అమలు కాకపోవడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తే, వారిని పోలీసు అధికారులు మందలించడంపై ప్రజాస్వామ్యవాదులు మండిపడుతున్నారు. పోట్లదుర్తి బ్రదర్స్ నియంతృత్వాన్ని అమలు చేయడమే తమలక్ష్యం అన్నట్లుగా జిల్లాలో అధికార యంత్రాంగం ఊడిగం చేస్తోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.